# మిగిలిన కంకర రాళ్లు

(కథానిక)

రాత్రి పదిన్నరవుతుంది.

"మీ వోటు ఎవరికి?"

"శోభనాద్రికి!"

"మీ వోటు ఎవరికి?"

"శోభనాద్రికి!"

ఈ కేకలకు నిద్రనుండి త్రుళ్ళిపడి లేచి కూర్చున్నాడు శోభనాద్రి. మంచం కింద మంచినీళ్ల రాగి చెంబు కాలికి తగిలి దూరంగా దొర్లింది. మొదట కల అనుకున్నాడు. కాని పూర్తిగా మెలకువ స్థితిలోవున్న తరువాత, అవే కేకలు యింకా గట్టిగా వినబడటం అతనికి ఆశ్చర్యం కలుగచేసింది. తనేమీ యెవళ్లని తన తరపున ప్రచారానికి ఇంకా నియమించలేదే? అభ్యర్థిత్వపు ఉపసంహరణ ముగింపు రేపో ఎల్లుండో అయినా, తాను పోటీ చేసేదీ లేనిదీ ఒక నిర్ధారణకు వస్తేగా? ఒకసారి బైటికి పోయి చూస్తే ఏంపోయిందీ?

రగ్గు కప్పుకొని చేతికర్ర తీసుకొని బయలుదేరాడు వీథిలోకి. వీథి తలుపు తీసీ తీయక మునుపే మళ్ళీ వినపడ్డాయి కేకలు.

"మీ వోటు ఎవరికి?"

"శోభనాద్రికి!"

"ఎందుకివ్వాలి?"

"ఎవడికి తెలుసు?"

తలుపుల తెరవడికి, ప్రైవేటు ట్యూషను నుండి యింటికి లాంతర్లు ఊపుకుంటూ తిరిగి వస్తూ అంతవరకు అరుస్తున్న కుర్రాళ్లు గోల చేస్తూ తుర్రున పారిపోయారు. శోభనాద్రి చాలా చికాకు పడ్డాడు. అసలే తన అభ్యర్థిత్వము సంగతి యింక మిథ్యమని తేల్చుకోలేక చస్తూంటే. పైగా "ఎందుకివ్వాలి? — ఎవడికి తెలుసు?"ట! శోధనం! శుద్ధ వెధవతనం! అప్పుడే ఏమిటీ ఎగతాళులూ, వెక్కిరింతలూనూ? అసలు సంగతి అటో, యిటో తెల్లవారేలోపల తేల్చుకోవాలి. మరి యిదంతా పుల్లయ్యమీదనే ఆధారపడి ఉంది. అతను చెప్పేది చెప్తానే ఉన్నాడు. తనే ఎటూతూగలేక తికమక పడుతున్నాడు.

గబగబా యింట్లోకి పోయి భార్యను లేపి తలుపు వేసుకోమని చెప్పి, పుల్లయ్య ఇంటికి బయలుదేరాడు. నడుస్తున్నంతసేపూ, శోభనాద్రి ఆలోచనతో గందరగోళమయి పోతున్నాడు. ఎన్నిమాసాలనుండి తాపత్రయ పడుతున్నాడో ఈ ఎన్నికల విషయంలో? తాను యెన్నికలలో అఖండ విజయం పొంది శాసన సభలో ప్రతి విషయంలోనూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించి మాట్లాడినట్లు చాలా కలలు గన్నాడు కూడాను. అటువంటి అదృష్టం తనకెప్పుడో? పోనీ, ఏదో విధంగా తను గెలిస్తే శాసన సభలో మాట్లాడటం చేతకావాలిగా? మాట్లాడాలంటే పాయింట్లు దొరకొద్దూ? ఆ, ఏదో ఒకటి మాట్లాడొచ్చనుకో. యిది గెలవాలే కాని... "రోడ్లు కొత్తవి వేయించాలి, దానికి యింత డబ్బు గ్రాంటు చేయాల"ని మంత్రిగారంటే, తను లేచి "వీల్లేదు. ఆరోడ్ల మీద సాయుధులైన పోలీసువారి లారీలు, మిలిటరీ లారీలు నడిపించి అమాయకులైన బీద ప్రజానీకాన్ని హింసించటానికి రోడ్లు వేస్తున్నారు!" అని అంతమాత్రం అనలేడూ? "పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరులకు జీతాలు పెంచాలి" అని ప్రభుత్వం అంటే "పోలీసువారికి జీతాలు ఎక్కువయిచ్చి ప్రభుత్వం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని అణకట్టుతోంది. దుష్కార్యాలు చేయిస్తోందని ఉపన్యాసం దంచవచ్చు. ఓస్! యిటువంటి విమర్శ ఎంతైనా చెయ్యొచ్చు, తను గెలవాలే గాని. మొన్న నాదాపురం సభను గురించి అన్న మాటలనుబట్టి ఒకటి తెలుస్తోంది, తను అనుకుంటున్నదానికంటే ఎక్కువ తెలివి

జీపనిగ మాధవరావు

తేటలు గలవాడిగా అనుకోని బదుకుతున్నాడని. ఒక నాటిరాత్రి వాళ్లింటి అరుగుమీద కూర్చొని నలుగురితో రాజకీయాలు మాట్లాడుతుంటే, నారాయణ అడిగాడు: "శోభనయ్యగారూ! మీరు నెహ్రూగారి జీవితచరిత్ర చదివేరా?" అని. అప్పుడు తనేమన్నాడు? "నెహ్రూ? ఎవరండీ ఈ నెహ్రూ? ఏ గృహస్థుమూ లేనిచోట ఆముదపు వృక్షమే పెద్దది లాగా కాంగ్రెస్‌వాళ్ళంతా నెత్తిమీద పెట్టుకొని ఊరేగుతున్నా గొప్పచేశారు." ఇప్పుడు బిగనంటున్నాడు. పైగా, ఆ పేరుమీద బిల్లు పెట్టి ఆడకూతుళ్లకు ఆస్తి పంచాలంటాడయ్యో? పంచేసుకునేట పడిందపుడు! తరతరాలనుండి ఏకఖండంగా ఉంటున్న ఆర్యావర్తాన్ని ద్వయంగా విభజించటానికి కొన్నాళ్ళపాటు చేతకాక తీరని అపకారం చేశాడు ఈ నెహ్రూ. అటువంటాయన జీవితచరిత్రని వ్యామోహం పెట్టుకొని చదవమంటావయ్యా? ఆయన ఏ ప్రాంతాలలో మీటింగు పెట్టినా, ఆయన ఉపన్యాసాన్ని నేను వినడానికి కూడా వెళ్లలేదు, అంతే. నా కాయన "పాలసీ" యిష్టం లేదు. ఆయనసంగతి నాకనవసరం." అని ఏకధాటిగా ఉపన్యసిస్తే నారాయణ అన్నాడు, "శోభనయ్యగారూ, మీరు నిజంగా పండితులేనండీ? ఏవో, అన్ని సంగతులు తెలుసుకోవాలి పుస్తకాలు చదవాలి అంటున్నారు గదా, యిదికూడా ఏమైనా చదివేరేమోనని అడిగానండీ. హృదయానికి హత్తుకుపోయేట్లు శోభగా చెప్పారు శోభనయ్యగారు!" ఇదంతా ఊళ్లో లైబ్రరీ వరండాలో కూర్చొని సుబ్బావధాన్లు రోజూ చెబుతూ ఉండే కబుర్లనే తనప్పుడు వప్పగించాడని, నారాయణకేం తెలుసు?

"శాసనాలు చేసేసభ" అని పెద్దపేరేకాని, దాని "మెంబరు"గా ఉండటం, ఏమంత కష్టమైన పనేం గాదు. క్రిందటిసారి తాను పోటీచేసి ఓడిపోయిన మునిసిపల్ కౌన్సిలర్ పదవి ఎటువంటిదో, యిదీ అటువంటిదే. శాసనసభ అంటే ఒక పెదగొప్ప మునిసిపల్ కౌన్సిల్ అన్నమాట. కౌన్సిలర్ తనరోడ్డూ, వీధిలోవాళ్ల సౌకర్యాలు ఎలా చూసుకుంటాడో, తనూ తన నియోజక వర్గానికి సంబంధించినంత వరకు సౌకర్యాలు కలిగించటంలో శ్రద్ధగా ఉండాలి. తనూ ఆ ప్రాంతంలో వాడే కాబట్టీ, పైగా "మెంబరు" కాబట్టీ, తనసంగతి, తనవాళ్ల సంగతీ యింకొంచెం శ్రద్ధగా చూసుకున్నా ఫరవాలేదు. ఏముంది? రైల్వేవాళ్లతో మాట్లాడి తన ఊరిలో మెయిల్‌ను, ఎక్స్‌ప్రెస్‌ను యింకొక రెండు నిముషాలు ఆపించేట్టు చూస్తే, ఊళ్లోవాళ్లు తనకు 'జై'లు కొట్టరూ? తన ఆకారవిశేషాలకి ఏం లోటులేదు. మనిషి ఒడ్డూ పొడుగూ ఫరవాలేదు. దానిమీద తెల్లటి ఖద్దరు లాల్చీ, ఖద్దరు బిళ్ళగోచీ పంచె, పైన కండువా వేసుకుంటే యింక చెప్పాలీ?... అబ్బ! యిదంతా తలుచుకుంటుంటే ఏమిటో 'యిది'గా ఉంది. ఇందాక ఆ తుంటరి వెధవలు 'మా వోటు శోభనాద్రికి' అన్నప్పుడే వళ్లు కొంచెం జలదరించింది, ఉవరలు 'ఎవడికి తెలుసు?' అని చెడగొట్టారుగానీ. వీళ్ళందరి పని, ఊళ్ళో తనకంతవరకు ఎదురు మాట్లాడుతున్న వాళ్ళపనీ తేలుస్తుంది తను గెలిస్తే. మరి యింకేమంది పార్టీవాళ్ళూ, స్వతంత్ర అభ్యర్థులూ ఉన్నారే తను ఎలా గెలవడం?... అన్నట్టు పుల్లయ్య యిల్లు.....?

శోభనాద్రి తలకాయను యీ ఆలోచనలు పూర్తిగా ఆక్రమించి. అతను పుల్లయ్య యింటికి వెళ్తున్నాడో, జనరల్ ఆస్పత్రివైపు పోతున్నాడో కూడా తెలియనీయకుండా చేశాయి. మళ్లీ ఫర్లాంగు వెనక్కి తిరిగి నడిచి పుల్లయ్య యింటికి చేరాడు.

"రావోయ్, శోభనం. ఏం? ఈ వేళప్పుడు దయచేశావు? ఏమైనా విశేషాలా? అలా కూర్చో" అంటూ కుర్చీ చూపించాడు ఇనప్పెట్టె దగ్గర డబ్బు లెక్కపెట్టూ కూర్చున్న పుల్లయ్య.

"ఆ పనిమీదనే వచ్చానోయ్. చూడు పుల్లయ్యా, నీవప్పుడప్పుడు చెప్తూనే ఉన్నావనుకో. కానీ అన్ని విషయాలూ సాకల్యంగా చర్చించుకోవాలని నా అభ్యర్థిత్వము సంగతి అటో యిటో తేల్చుకుందామని వచ్చాను."

"నేనూ అనుకుంటున్నాను మీ యింటికి వద్దామని. నీవే వచ్చావు, బాగుంది... శోభనం. నేను నీ స్నేహాభిలాషిని కాబట్టి నీవు నావద్దకు

యిటువంటి ముఖ్యమైన విషయాలలో సలహా-కాకపోతే- సహాయం అడగటానికి వచ్చావు. అంతేనా? నేను చెప్పే ముక్కలు కొంచెం కటువుగా నిర్మొహమాటంగా తోచవచ్చు. ఇంకోవిధంగా అనుకోకు. నేను నీ శ్రేయస్సు కోరేవాడినన్న సంగతి మాత్రం మరచిపోకు." అంటూ సౌమ్యంగా, తాపీగా మొదలెట్టాడు పుల్లయ్య. శోభనాద్రి తన యింటికి వచ్చినా తను శోభనాద్రి యింటికి వెళ్ళినా, బోధించవలసిన విషయాలన్నీ పుల్లయ్య ముందుగానే మనసులో అల్లి పెట్టుకొన్నాడు.

శోభనాద్రి కుర్చీలో కాళ్ళు ముడుచుకొని అన్నాడు. "అబ్బెబ్బే. అటువంటిదేమీ లేదు పుల్లయ్యా. మనిద్దరం యిప్పటి వాళ్ళమా?"

శోభనాద్రికి దగ్గరగా కుర్చీ లాక్కొని కూర్చొని కన్నార్పకుండా అతని ముఖంలోనికి చూస్తూ, నిదానంగా పుల్లయ్య అన్నాడు: "రేపు ప్రొద్దున్నే రిటర్నింగ్ ఆఫీసరు దగ్గరకు నా కారులో పోయి, స్వయంగా నీ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకొని రా."

"ఆ!" అన్నాడు శోభనాద్రి అదరిపాటుతో కాళ్ళు క్రిందికి దించుతూ.

"గాభరాపడకు శోభనం! నేను చెప్పే మాటల వెనుక బలవత్తరమైన కారణాలు చాలా ఉన్నాయి ... ఇప్పుడు జరగబోయే ఎన్నికలలో, చదువూ సంస్కారమూ కలిగిన కొద్దిమందిలో తప్ప, వివిధ రాజకీయ పార్టీల ఆశయాల విశిష్టతను గురించి తర్కించి ఎవరూ తమ వోటును వినియోగపరచడం లేదు. పోటీ చేస్తున్నది పార్టీ అభ్యర్థి కానీ, స్వతంత్ర అభ్యర్థి కానీ, ఆ అభ్యర్థి యొక్క కులం లేక మతం ఆ అభ్యర్థి యొక్క జయాపజయాలలో ఎక్కువగా వ్యవహరిస్తోంది. వాటి ఆసరా చూసుకునే మన ఊళ్ళో నీవే కాదు, అనేకమంది అనేక ప్రాంతాలలో పదవీ వ్యామోహంతో టకటకా నామినేషన్లు దాఖలా చేశారు. వోటర్లలో కుల మత తత్వాలు బాగా ప్రవేశపెట్టి రేకెత్తించుతే గాని, ఈ పోటీదారులు గెలుపొందరు. సుశీలతా, కార్యదీక్ష కలిగిన యోగ్యుడైనవాడు గెలుపొందడానికి ఎంతో కష్టపడాలి. కాని ఏవిధంగానైనా గెలుపే ముఖ్యమనుకుంటే నీతి నియమాలు వదిలేయాలి.

ఇక రెండవది డబ్బు విషయం. డబ్బును వినియోగించక మంచినిగానీ, చెడునుగానీ సాధించటం కష్టసాధ్యమయిన సంగతి నీకు తెలుసుగదా? చెడు కొనసాగించటానికి మంచికంటే డబ్బు యెక్కువ వ్యయం చేయాలి. మన దుష్టపుకోరికలు, చర్యలు నెరవేరాలీ, కొనసాగాలీ అంటే వాటిని నిరసించేవాళ్ళనుకూడా కూడగట్టుకొని మనం గెలుపొందాలి. అది దేని వలన సాధ్యమౌతుంది? డబ్బు. డబ్బువల్లనేగా? కొంతమందిలో ఆ నిరసింపును డబ్బు చంపేస్తుంది. వాళ్ళను యింకా హీనుల్నిగా చేస్తుంది. ప్రజాస్వామ్యానికి ప్రధానమైన పవిత్రపు వోటు హక్కును, అపవిత్రంగా ఉపయోగింప చేసేది డబ్బు. కాబట్టి మంచికోసం ప్రాయంగా ధనవ్యయం చేసైనా వోట్లు కొనటానికి వెనుదీయకూడదు. ఇవన్నీ చెప్తాంటే, నేనేదో నీతినీ, ధర్మాన్నీ ప్రబోధిస్తున్నాననీ, వాటికి దూరంగా ఉండటానికి జంకుతున్నానని అనుకునేవు సుమీ. అవినీతినీ, అధర్మాన్నీ మనకు లాభకరంగా ఉపయోగింప చూడటమే నా ఉద్దేశ్యం."

"మరి నా ఉపసంహరణ సంగతి?" అనుమానాస్పదంగా శోభనాద్రి ప్రశ్నవేశాడు. నైచ్యానికి జంకనని పుల్లయ్య తన విషయంలో సందేహిస్తున్నదేమిటో అతనికేమీ అర్థం కాలేదు.

"తొందరపడకు శోభనం. అదే చెప్తాస్తున్నాను. మనవూరి సుబ్బరామారావు కూడ ఈ యెన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయదలచాడని నీకు తెలుసుగదా? అతనుకూడ నా వద్దకువచ్చి సహాయంకోరాడు. మీ యిద్దరిలోటుపాట్లు విచారించి చూస్తే నేను ఖర్చు చేయదలచుకున్న లక్షరూపాయలకు అతనే అర్హుడని తోస్తోంది."

ఇంకా దిగజారిపోయాడు శోభనాద్రి. నిరాశాజనకమైన ఆవేదన కళ్ళలో కనిపిస్తోంది. పుల్లయ్య ఆగకుండా సాగిపోతున్నాడు.

"అతను బి. ఎ. వరకు చదివాడు. డిస్ట్రిక్టు బోర్డుమెంబరు. ఈవూరి లేబరు యూనియను

ప్రెసిడెంటు. ఈ ఊళ్ళో యింతవరకు 'మంచి వాడు'గానే పేరు సంపాదించాడు. ప్రజాదరణ కొంతవరకైనా ఉన్నవాడు. మన ఊరిలో కాకపోయినా, చుట్టూఉన్న ఈ నియోజక వర్గానికి సంబంధించిన పల్లెలలో అతని కులస్థులు చాలామంది ఉన్నారు. ఇందులో నువ్వొకటి గ్రహించాలి. అతనిలో శాసనసభ్యుని కుండవలసిన లక్షణాలున్నాయి. యోగ్యుడు. కాబట్టి అతనే ఎన్నుకోనబడాలి అనికాదు యిదంతా నేను చెప్పటం. మీ యిద్దరిలో ఎవరు గెలిచినా, మనకు కలుగవలసిన లాభంలో ఏమీ తేడా ఉండదు. కాని, రేపు ఎన్నికలలో అతనికి నీకంటె విజయుడవటానికి పైవాటి దృష్ట్యా ఎక్కువ అవకాశం ఉంది. మన ప్రయోజనం సాధింపబడేంతవరకూ "మంచి" రంగుకలిగి ఉండాలి. తరువాత రంగు ఫిరాయించినా ఫరవాలేదు.

"ఇక నీ విషయంలో చిక్కేమిటంటే, సుబ్బరామారావుకున్న చదువూ, సంస్కారమూ, ప్రజాదరణ నీకులేవు. పైగా మన ఊరు యిప్పుడు చాలా మారిపోయింది. వెనక యుద్ధపు రోజుల్లో గవర్నరు మన ఊరిని సందర్శించినప్పుడు మనిద్దరం యుద్ధనిధికి పోటీపడి విరాళాలిచ్చి బిరుదులకోసం తాపత్రయపడ్డప్పటి ఊరు కాదు యిప్పటి ఊరు. మన యెదుట పుస్తకాలు పుచ్చుకొని స్కూలుకెళ్లిన వాళ్లు, ఈనాడు ఊరికి లీడర్లయి కూర్చున్నారు. యిప్పుడు రెండు హైస్కూళ్లు. అందులో కొత్తగా కాలేజీ పెట్టారు. ఎప్పుడు ఎక్కడ మీటింగు పెట్టినా గుక్క తిప్పుకోనీకుండా ప్రశ్నలేకదా? నీవు రేపు ఎన్నికలలో పోటీకి దిగినట్లయితే, తప్పకుండా చాలుసైగను సార్లు మీటింగులు జరపాలి. మరెవర్నీ కాకుండా, నిన్నే ఎన్నుకోనటంవలన ప్రజలకు కలిగేలాభాలు విశదపరచాలి. ఎలాగో తంటాలు పడి నాలుగుముక్కలు చెప్పటానికి సిద్ధపడుతూంటే, ఒకస్టూడెంటు లేచి "ప్రజాస్వామ్యం" అంటే ఏమిటో అర్థం చెప్పమంటాడు. తడుముకోకుండా ఏమని నిర్వచించగలవు? ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని గత మూడు మాసాల నుంచేగా నీవు తెలుగు పేపరు చదవటం మొదలెట్టింది? కాబట్టి సూయజ్ కాలువ అంటూ ప్రపంచంలో ఒకటుందనీ, పర్షియా దేశంలో నూనె బావులున్నాయని మాత్రం తెలుసుకో గలిగావు. "ఈ కొలతలుగల యింటికి ఎన్ని వేల యిటుక పడ్తుంది?" అని అడుగుతే, బిల్డింగ్ కంట్రాక్టరువు కాబట్టి "అయిదువేల రెండు వందల యెనభై" అని వందలు, పదులతోసహా చెప్పగలవు. నీ అసమర్థతతో మీటింగు గగ్గోలు అవుతుంది. పిల్లికూతలు నక్కకూతలు నీవు వెనక సిమెంటులో నల్లవ్యాపారంచేసి అరెస్టు అయిన సంగతి ఊళ్లో ప్రజ యింకా మర్చిపోలేదు. "నేను ప్రజా సేవ చేయదలచుకున్నాను. దేశసేవే నా పరమావధి" అని ఉపన్యాస వేదిక మీద యెంత గోలపెట్టినా, వినేవాళ్లు నమ్ముతారనేది సత్యదూరం. ప్రజా సేవ, దేశ సేవా కొంతులు యెవరికైనా యెన్నిక అప్పుడే. స్వాతంత్ర్యోద్యమపు రోజుల్లో, కాంగ్రెసువాళ్ళు యెక్కడ దాక్కున్నదీ ప్రయాసపడి కనుక్కొని బ్రిటిషువాళ్లకు అప్పగించిన మనం, ఇప్పుడు "దేశసేవ" అంటూ గొంతెత్తి అరుస్తున్నామంటే అందరూ హాస్యం చేస్తారు. అందుకనే స్వాతంత్ర్యం వచ్చిన తరు




వాత నాలుగేళ్ళలో కూడ మనం ప్రజా విశ్వాసాన్ని సంపాదించలేక పోయాం. ఇంతెందుకూ? అసలు నేను ఈ ఎన్నికలకు నిలుచుందామని, ఆలోచనమీద ఆ ప్రయత్నం విరమించవలసి వచ్చింది. మనం రావుబహదూరు బిరుదుకోసం ఎంత పోటీపడ్డామో, పెద్దపేరు కూడా సమానంగా పోటీపడి తెచ్చుకున్నాం... ఈ ఎన్నికలలో దాఖలా పత్రాలు తిరస్కరింపబడ్డవాళ్ళూ, మధ్యలో ఉపసంహరించుకున్న వాళ్ళూ, ఓడిపోయిన వాళ్ళూ, గెలిచినవాళ్ళూ- ఈ అభ్యర్థులందరూ నిశ్చయ చిత్తంతో దేశంకోసం కొద్దిగానన్నా పాటుపడుతే యిక కావలసిం దేముంది?... ఇంకో విషయం మరచిపోయాను. పార్లమెంటుకు పోటీచేస్తున్న ఒక అభ్యర్థికీ, సుబ్బరామారావుకూ ఒక కాంట్రాక్టు ఉంది. ఈ ఊరిచుట్టూ ఉన్న పల్లెలలోని సుబ్బరామారావు కులస్థులు ఆ పార్లమెంటు అభ్యర్థికి కనుక వోట్లు వేసేటట్లు సుబ్బరామారావు చూస్తే, శాసనసభకు సంబంధించిన ఈ నియోజకవర్గములోని ఆ పార్లమెంటు అభ్యర్థి యొక్క 'సపోర్టర్స్' సుబ్బరామారావుకు తోడ్పడుతారు. దీనినిబట్టి ఆలోచించి చూడు, మీ యిద్దరిలో ఎవరి గెలుపుకు ఎక్కువ అవకాశముందో!... నిన్నదో కించపరుస్తున్నాననుకోకు శోభనం. ఈ విషయం ఎంతో ధనవ్యయానికీ, శ్రమకూ సంబంధించినది... ఇవన్నీ కాకుండా, వీటన్నిటిమీదా నీ సహాయం కూడా కావాలి. నీవు ఎన్నికలను నిల్చుంటే నమ్మకంగా నీకు వస్తాయనుకున్న వోట్లు కూడా, సుబ్బరామారావుకు పడేట్లు చూడాలి. 'కులం' మీద వోట్లు రాబట్టటం మీ యిద్దరి వంతూ, డబ్బును అతనిపరంగా ధారవోసి వోట్లు తేవటం పరోక్షంగా నావంతు ... సహాయం అర్థించిన వాడినే సాయపడమనటం భావ్యం కాకపోయినా, నీవు ఈవిషయంలో మమ్మల్ని నిరుత్సాహపరచకూడదు. నీవు చేసే సహాయాన్ని మరచిపోయేంత కృతఘ్నులం కాదు మేము. ఒక విషయముంది. రహస్యంగా ఉంచు. దగ్గర కొస్తున్న మ్యునిసిపల్ ఎన్నికలలో నీవు చైర్మన్ పదవి అలంకరించే బాధ్యత మాకు వదులు. ఇందులో ఏమాత్రం సందేహంలేదు. నామాట మీద నమ్మకముంచు. చైర్మన్ యొక్క వచ్చేపొయ్యే కరస్పాండెన్స్ అంతా నేను చూసి పెట్తాను. ఏమంటావ్ శోభనం?"

ఈ మాటలన్నీ శోభనాద్రి నీరసంగా వింటున్నాడు. నాలుక తడుపుకుంటూ ఒక నిముషం దాకా ఏమి మాట్లాడలేకపోయాడు. ఈ వైఖరిలో పుల్లయ్యకు కొంత ఆసరా దొరికింది. శోభనాద్రి భుజాలమీద రెండు చేతులూవేసి తట్టుతూ అన్నాడు "అనుమానించకు. నేను చెప్తున్నది అక్షరాలా జరుగుతుంది. మోసం ఏమీలేదు. సుబ్బరామారావు కూడా మనకు అండగా ఉంటాడు. గెలిచాక యిక చెప్పక్కర్లేదు. మనం యెన్ని దొంగనాటకాలైనా ఆడొచ్చనుకో. పోనీ ఆలోచించి రేపుప్రొద్దున చెప్పులే. చాలా పొద్దుపోయింది" అంటూ లేచాడు పుల్లయ్య.

శోభనాద్రి వీధి గుమ్మం వరకు వెళ్లేదాకా ఏమీ మాట్లాడలేదు. "వెళ్ళొస్తాను పుల్లయ్యా" అన్నాడు మెట్లు దిగుతూ.

రెండు గంటల క్రితం పుల్లయ్య యింటికి వెళ్ళేటప్పుడు యెంత ఉత్సాహ పూరితమైన ఆలోచనలతో ఉన్నాడో, తిరిగి వచ్చేటప్పుడు అంత నిరుత్సాహి అయ్యాడు. తెల్లవారేలోపల ఏదో ఒక నిర్ణయానికి రావాలనే పట్టుదలలో ఏ మార్పూ లేదు.

* * *

భార్య మంచినీళ్లు అందిస్తే, మంచం మీద కూర్చొని త్రాగుతూ అడిగాడు శోభనాద్రి, "మొన్న శాంపిల్స్‌గా వచ్చిన కంకర రాళ్ళు అలమారాలో ఉన్నాయా? పిల్లవాళ్లు పారేశారా?"

"రేపు ప్రొద్దున చూసి చెప్తాను... ఈ చీకట్లో యిప్పుడు నేను వెతకలేను" భార్య నిద్రమత్తుతో కూడిన విసుగుతో అంది.

"అంతేలే... గుర్తుంటుందిలే... ఏముంది?... నేను కూడా కంకర్...కంకర్...కం...క...ర్."

ముసుగులో మ్యునిసిపల్ కౌన్సిల్ సృష్టించుకున్నాడు శోభనాద్రి.